సాక్షి ఖమ్మం

శనివారం । 3 । ఫిబ్రవరి । 2024



పాలధారలు!

మధిర నియోజకవర్గంలో ఇందిరమ్మ డెయిరీ ఏర్పాటు చేయనుండడంతో పాల ఉత్పత్తి పెరగడమే కాక పలువురికి ఉపాధి లభించనుంది. 10లో



'ఆట' సాగడం లేదు..

జిల్లాలో ఏర్పాటుచేసిన క్రీడాప్రాంగణాలను సమస్యలు వేధిస్తుండడంతో ఎక్కడ కూడా క్రీడాకారులకు ఉపయోగపడడం లేదు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 19°

వాతావరణం

జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఉక్కపోత వాతావరణం ఉంటుంది. రాత్రి మాత్రం చలిగాలుల ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

నేడు మెగా జాబ్ మేళా

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యాన ఖమ్మంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్, డీవైఎస్ఓ సునీల్‌కుమార్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. స్టేడియంలో శనివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మెగా జాబ్ మేళా జరుగుతుందని, 65కి పైగా కంపెనీల్లో ఉద్యోగావకాశాలు ఉన్నందున ఎస్సెస్సీ ఆపై విద్యార్హత ఉన్న నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాలేరుకు చేరిన సాగర్ జలాలు



నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఈఈ, ఉద్యోగులు

కూసుమంచి: జిల్లాలో తాగునీటి అవసరాల నిమిత్తం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుండి విడుదల చేసిన నీరు శుక్రవారం మధ్యాహ్నం పాలేరు రిజర్వాయర్‌కు చేరింది. ప్రస్తుతం సాగర్ నుండి 3వేల క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు చేరుతుండగా, 10.60 అడుగులకు పడిపోయిన రిజర్వాయర్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. సాగర్ నీటితో రిజర్వాయర్‌ను 23 అడుగుల పూర్తి స్థాయికి నింపాక తాగునీటి అవసరాలకు వినియోగిస్తామని అధికారులు తెలిపారు. జలవనరుల శాఖ పాలేరు ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు తదితరులు నాయకన్‌గూడెం ఇన్‌ఫాల్ రెగ్యులేటర్ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించి నీరు వృధా కాకుండా తూములు, షట్టర్ల వద్ద పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు.


నేడు జిల్లాకు ఎంపీ నామ

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత నామ నాగేశ్వరరావు శనివారం నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగే బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొంటారు. ఆతర్వాత ఖమ్మం కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 3గంటలకు మొదలయ్యే దిశ కమిటీ సమావేశానికి ఎంపీ హాజరవుతారు. ఈసమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై శాఖల వారీగా ఎంపీ సమీక్షిస్తారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: పోస్ట్‌మెట్రిక్ కోర్సులు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగులు ఉపకార వేతనాల కోసం ఈ–పాస్ వెబ్‌సైట్ ద్వారా మార్చి 31లోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. అర్హులైన విద్యార్థులతో దరఖాస్తు చేయించే బాధ్యత కళాశాలల ప్రిన్సిపాళ్లు తీసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నాక హార్డ్ కాపీ, ధ్రువపత్రాలతో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

లబ్ధిదారుల గుర్తింపు పూర్తిచేయండి



అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

కొణిజర్ల: స్వచ్ఛ భారత్ మిషన్ కింద మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల గుర్తింపు, బిల్లుల మంజూరు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ సూచించారు. కేంద్రప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ కింద మంజూరు చేసిన మరుగుదొడ్లు నిర్మించుకున్న వారికి బిల్లులు మంజూరు కాలేదు. ఇటీవల కేంద్రం నిధులు విడుదల చేయడంతో బిల్లులు మంజూరు చేసేందుకు ప్రత్యేకమైన యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఈప్రక్రియను కొణిజర్లలో శుక్రవారం పరిశీలించిన అదనపు కలెక్టర్... త్వరగా వివరాలు నమోదు చేసి బిల్లులు వచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. డీఆర్‌డీఓ ఎం.విద్యాచందన, ఎంపీడీఓ కె.మహాలక్ష్మి, అధికారులు అనూప్, జక్రియా, అమ్మాజాన్, సునీల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

5నుంచి పలు రైళ్ల రద్దు

ఖమ్మం మామిళ్లగూడెం: సికింద్రాబాద్ మౌలాలీ వద్ద ట్రాక్ పనులు జరుగుతున్న నేపథ్యాన పలు రైళ్లను రద్దు చేసినట్లు ఖమ్మం సీసీఐ ఎం.డీ.జాఫర్ తెలిపారు. ఈనెల 5నుంచి 11వ తేదీ వరకు సికింద్రాబాద్–గుంటూరు (12705), గుంటూరు–సికింద్రాబాద్(12706) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌తో పాటు శాతవాహన, గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను రెండు వైపులా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈవిషయాన్ని ప్రయాణికులు గమనించాలని ఆయన సూచించారు.

ఆనాటి అందమేదీ ?!

జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న రఘునాథపాలెంలో 'సుడా' ఆధ్వర్యాన కొన్నాళ్ల క్రితం పార్క్ ఏర్పాటు చేశారు. అప్పటి పాలకులు దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోగా వాకింగ్ ట్రాక్, అందమైన ఫౌంటెన్లు, పక్షులు, జంతువుల బొమ్మలతో తీర్చిదిద్దారు. కొన్నాళ్లు నిర్వహణ బాగానే ఉన్నా.. ఆతర్వాత గ్రామపంచాయతీకి అప్పగించినట్లు తెలుస్తోంది. దీంతో వారు పట్టించుకోకపోవడం.. ఆపై 'సుడా' పాలకవర్గం రద్దు కావడంతో పార్క్ ముఖం చూసే వారే కరువయ్యారు. ఫలితంగా రూ.లక్షలు వెచ్చించి మరీ ఏర్పాటు చేసిన ఈ పార్క్ ఆహ్లాదాన్ని పంచకపోగా.. రూపురేఖలనే కోల్పోతోంది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్





కళావిహీనంగా మారిన ఫౌంటెన్ (ఇన్‌సెట్) పక్షి బొమ్మ విరగగా మిగిలిన కాళ్లు



పిచ్చిమొక్కలతో నిండిన వాకింగ్ ట్రాక్ (ఇన్‌సెట్) సుడా పేరులో మాయమైన అక్షరాలు, ఆనవాళ్లు కోల్పోతున్న తల్లీబిడ్డల బొమ్మ

బోరుమంటున్నారు



బోర్ నీటిని బావిలోకి మళ్లిస్తున్న దృశ్యం

బోర్లు, బావులే ఆధారంగా పంటలు చేసే రైతులకు గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఈ ఏడాది వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవడంతో జిల్లాలోని పలుచోట్ల భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో రూ.లక్షలు వెచ్చించి బోర్లు వేసినా నీరు రాక కళ్ల ముందే పంటలు ఎండిపోతుండటం చూస్తున్న అన్నదాతలు బోరుమంటున్నారు. ఒకప్పుడు 20 అడుగుల నుండి 30 అడుగుల లోతులోనే నీరు వచ్చేది. కానీ ఈ ఏడాది ఆ పరిస్థితులు లేక పంటలను రక్షించుకునేందుకు నానా తిప్పలు పడుతున్నారు. – రఘునాథపాలెం



వడలిపోతున్న మొక్కజొన్న పైరు

- జిల్లాలోని పలు ప్రాంతాల్లో అడుగంటిన భూగర్భ జలాలు
- రూ.లక్షలు వెచ్చించి బోర్లు వేయిస్తున్న అన్నదాతలు
- అయినా ఫలితం లేక ఎండిపోతున్న పంటలు
- సబ్సిడీపై బోర్లు వేయించి మోటార్లు ఇవ్వాలని విన్నపం

చేదు అనుభవాలే...

కర్షకులకు ఏటా తెగుళ్లు, నకిలీ విత్తనాలతో కష్టాలు ఎదురవుతుండగా.. పంటలకు నీరు అందించడం మరో సమస్యగా మారింది. అయితే, సాగు చేసిన పంటను ఎలాగైనా రక్షించుకోవాలనే తపనతో ఎంత డబ్బు ఖర్చయినా సరే అన్నట్లుగా అప్పులు చేసి మరీ బోర్లు వేయిస్తున్న రైతులకు చేదు అనుభవాలే ఎదురవుతున్నాయి. జిల్లా కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న రఘునాథపాలెం మండలం వేపకుంట్లలో పలువురు రైతులు మొక్కజొన్న, మిరపతోపాటు కూరగాయలు, పండ్ల తోటలు సాగు చేశారు. అయితే, వర్షాభావ పరిస్థితులతో బావులు, బోర్లలో నీరు అడుగంటడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. గ్రామానికి ఇరువైపులా రెండు చెరువులు ఉన్నా నీరు అడుగంటింది. ఐదు కిలోమీటర్ల దూరంలో సాగర్ ప్రధాన కాల్వ ప్రవహిస్తున్నప్పటికీ నీరు వచ్చే మార్గం లేదు. అయినా కాల్వ పారుతుంటే భూగర్భ జలాలు ఆశించిన స్థాయిలో ఉండేవి. కానీ ఈసారి సాగర్ నీరు కూడా విడుదల కాక ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పడిపోయినట్లు తెలుస్తోంది.

400 అడుగులకు పైగానే..

వేపకుంట్లలో ఒక్కో రైతు మూడు నుంచి ఆపై సంఖ్యలో బోర్లు వేయించారు. అవి కూడా 400 అడుగులు మొదలు 500 అడుగుల వరకు తవ్వించినా పెద్దగా ఫలితం కానరాలేదని చెబుతున్నారు. ఇందుకోసం ఒక్కో రైతు రూ.5లక్షల నుండి రూ.20లక్షల వరకు వెచ్చించినట్లు చెబుతున్నారు. కొందరి బోర్లలో ఆశించిన స్థాయిలో కాకపోయినా కొద్దిమేర నీరు రావడంతో సమీపంలోని బావుల్లోకి వదిలి అవసరమున్నప్పుడు పంటలకు విడుదల చేస్తున్నారు. అయినా నీరు సరిపోక మొక్కజొన్న, మిర్చి చేన్లు వడలిపోతుండడంతో రైతులు నీరు ఎలా వస్తుందో తెలియక.. కళ్ల ముందు మెదులుతున్న అప్పులను తలుచుకుంటూ కుమిలిపోతున్నారు. అయితే, ఒక్క వేపకుంట్ల గ్రామంలోనే కాక వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేసే అన్ని గ్రామాల్లో ఇదే సమస్య ఉందని తెలుస్తోంది. కాగా, ప్రభుత్వం సబ్సిడీపై బోర్లు వేయించడంతో పాటు మోటార్లు అందిస్తే కొంతైనా రైతులపై భారం తగ్గే అవకాశముంది.



ఈ రైతు పేరు ఆంగోతు రాందాస్. వేపకుంట్లకు చెందిన ఈయన 13 ఎకరాల్లోని మొక్కజొన్న, పెసర పంటలు వడలిపోతుండడంతో కాపాడుకునేందుకు అప్పులు చేసి మరీ పది బోర్లు వేయించాడు. ఒక్కొక్కటి 500 అడుగులపైగానే తవ్వించినా పెద్దగా నీరుపడలేదు. బోర్లు వేయించడంతో పాటు మోటార్ల కొనుగోలుకు రూ.2లక్షలకు పైగా వెచ్చించినా ఫలితం లేదని రాందాస్ వాపోతున్నాడు. ఒకటి, రెండు బోర్లలో అరకొరగా వస్తున్న నీటిని బావిలోకి నింపి అక్కడి నుండి మోటార్ ద్వారా పంటకు అందిస్తున్నానని తెలిపాడు.

పంటలు నిలువునా ఎండిపోతున్నాయి..



ఎండుతున్న పంటలను రక్షించుకోవడానికి చేయని ప్రయత్నం లేదు. సొంత భూమికి తోడు కొంత కౌలుకు తీసుకుని పంటలు సాగు చేశా. మూడు బోర్లు వేసినా నీరు పడలేదు. ప్రత్యామ్నాయ మార్గం లేక దేవుడిపైనే భారం వేశాం. సాగర్ కాల్వలో నీరు ప్రవహించినా మా ప్రాంతంలో భూగర్భజలాలు పెరిగేవి.

– గుగ్గిళ్ల ఉపేందర్, రైతు

సబ్సిడీపై బోర్లు, మోటార్లు ఇస్తే మేలు



రైతుల కోసం అది చేశాం, ఇది చేశామని కాకుండా ఎండిపోతున్న పంటలను కాపాడుకునేలా అండగా నిలవాలి. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టినప్పటికీ సాగునీరు లేక కళ్ల ముందే పంటలు ఎండిపోతున్నాయి. బోర్లు, మోటార్ల కోసం గతంలో మాదిరిగా సబ్సిడీలు ఇస్తే మాపై కాస్త భారం తగ్గుతుంది.

– అనబోతు నర్సింహారావు, రైతు

ఎన్నికలకు సిద్ధం..

- ఓటరుగా నమోదుకు ఇంకా అవకాశం
- ఈనెల 6వరకు పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవచ్చు..
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల సంఘం ఎప్పుడు ఆదేశించినా జిల్లాలో లోక్‌సభ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు సాఫీగా నిర్వహించేదుకు సిద్ధమవుతున్నట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభతో పాటు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

8న ఓటర్ల తుదిజాబితా

లోక్‌సభ ఎన్నికలకు అవసరమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధి ఓటర్ల జాబితాలో స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా 23,124 చేర్పులు జరిగాయని, 20,435మందిని వివిధ కారణాలతో తొలగించామన్నారు. శుక్రవారం నాటికి 12,19,521మంది ఓటర్లు ఉన్నట్లు తేలిందని తెలిపారు. అయితే, ఈనెల 8వ తేదీన తుది జాబితాను విడుదల చేస్తామని పేర్కొన్నారు. కాగా, 18ఏళ్లు నిండిన వారు ఇంకా దరఖాస్తు చేసుకునే అవకాశముందని తెలిపారు. ఇక వైరా మినహా మిగతా నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకప్ ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభిస్తామని కలెక్టర్ చెప్పారు. అయితే, వైరా నియోజకవర్గానికి సంబంధించి కేసు ఉన్నందున కోర్టు సూచనల మేరకు ముందుకు సాగనున్నట్లు వెల్లడించారు.

దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం – వరంగల్ – నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి జిల్లాలోని పట్టభద్రులు ఈనెల 6వ తేదీలోపు ఓటు హక్కు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. 2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 87,172 మంది ఓటర్లు ఉండగా.. ఇప్పుడు 53,464 మందే దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇకనైనా 31 అక్టోబర్ 2020 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తయిన వారు ఆన్‌లైన్ లేదా నేరుగా దరఖాస్తులు అందజేయాలని, సర్టిఫికెట్లపై గెజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించాలని పేర్కొన్నారు. దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం అనంతరం ఏప్రిల్ 4వ తేదీన తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, సమయపాలనే ప్రధానం

పోలీసు కమిషనర్ సునీల్‌దత్



పరేడ్‌ను ఉద్దేశించిన మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: పోలీస్ ఉద్యోగులకు వ్యక్తిగత క్రమశిక్షణ, సమయపాలన ముఖ్యమని సీపీ సునీల్‌దత్ అన్నారు. ఖమ్మంలోని పరేడ్ మైదానంలో సీటీ ఆర్ సిబ్బందికి పదిహేనురోజులుగా నిర్వహిస్తున్న మొబిలైజేషన్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈసందర్భంగా పరేడ్‌ను పరిశీలించిన సీపీ మాట్లాడుతూ శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు సహాయకారిగా ఉండే ఏఆర్ ఉద్యోగులకు సమస్యను నిలువరించే సమయస్ఫూర్తి అవసరమని తెలిపారు. అయితే, విధుల్లో ఉత్సాహంగా పనిచేసేలా నిరంతర శిక్షణ అవసరమని, అందుకే మొబిలైజేషన్ క్యాంపు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. అనంతరం ఫైరింగ్ ప్రాక్టీస్‌లో ప్రతిభ చూపిన ఉద్యోగులకు సీపీ జ్ఞాపికలు అందజేశారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు ప్రసాద్‌రావు, కుమారస్వామి, ఏఆర్ ఏసీపీలు నర్సయ్య, సుశీల్ సింగ్, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్, తిరుపతి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆపరేషన్ స్మైల్‌తో బంగారు భవిష్యత్

బాలలకు బంగారు భవిష్యత్ అందించాలనే లక్ష్యంతోనే బాలకార్మిక వ్యవస్థలో ఉన్న వారికి విముక్తి కల్పించేలా ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. మహిళా, శిశు సంక్షేమ, పోలీసులు, కార్మిక, శిశు సంరక్షణ శాఖ అధికారులతో కూడిన కమిటీల ఆధ్వర్యాన జనవరిలో నిర్వహించిన తనిఖీల్లో 70 మంది బాలలకు విముక్తి కల్పించి తల్లిదండ్రులకు అప్పగించామని వెల్లడించారు.

జీపీల్లో రికార్డులు పక్కాగా ఉండాలి..

ఆకస్మిక తనిఖీల్లో కలెక్టర్ గౌతమ్



రఘునాథపాలెం : వీ.వీ.పాలెంలో వివరాలు సేకరిస్తున్న కలెక్టర్ గౌతమ్

రఘునాథపాలెం/కొణిజర్ల: గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనుల నివేదికలు, మంజూరైన నిధులకు సంబంధించి రికార్డులు పక్కాగా ఉండాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. రఘునాథపాలెం మండలంలోని వీ.వీ.పాలెం, కొణిజర్ల మండలంలోని తనికెళ్ల గ్రామపంచాయతీలను అదనపు కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులు వెంటనే బాధ్యతలు స్వీకరించాలని తెలిపారు. ఆతర్వాత రికార్డులు స్వాధీనం చేసుకుని అన్ని వివరాలు పరిశీలించాలని, జీపీల్లో పాలనపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమాల్లో జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, డివిజనల్ పంచాయతీ అధికారి పుల్లారావు, ఎంపీడీఓ కె మహాలక్ష్మి, ప్రత్యేకాధికారి సురేష్, పంచాయతీ కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల, అంగన్‌వాడీల తనిఖీ

ఖమ్మం రూరల్: మండలంలోని మద్దులపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ గౌతమ్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరును పరిశీలించిన ఆయన అందరూ బడికి వచ్చేలా పర్యవేక్షించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆతర్వాత అంగన్‌వాడీ కేంద్రంలో మెనూ అమలుపై కలెక్టర్ ఆరా తీశారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఖమ్మం సహకారనగర్: ఎస్‌బీఐ, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ ఆధ్వర్యాన ఈనెల 15, 16వ తేదీల్లో అప్లికేషన్స్ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ మ్యాథమెటిక్స్‌పై సదస్సు జరగనుంది. ఈ సదస్సు వాల్‌పోస్టర్లను కలెక్టర్ గౌతమ్ కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. సోషల్ వెల్ఫేర్ ఆర్‌సీఓ ప్రత్యూష, చైర్మన్ డాక్టర్ బి.ఝాన్సీరాణి, సదస్సు డైరెక్టర్ కల్పన, కన్వీనర్ డాక్టర్ మంజుల పాల్గొన్నారు.

'బెళగావి'కి వేళాయె



రేపటి నుంచి నడవనున్న ఎక్స్‌ప్రెస్

- మరోసారి పునరుద్ధరించిన రైల్వే శాఖ
- ఈ నెల వరకే ప్రకటించిన అధికారులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర రాజధానిలో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కుటుంబ సభ్యుల రాకపోకలకు అనువుగా ఉన్న బెళగావి ఎక్స్‌ప్రెస్‌ను మరోసారి రైల్వేశాఖ పునరుద్ధరించింది. ఈ రైలు ఆదివారం నుంచి బెళగావి– సికింద్రాబాద్–భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) స్టేషన్ల మధ్య నడవనుంది.

ప్రయాణికులకు అనుకూలం

ప్రస్తుతం కొత్తగూడెం నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు రెండు రైళ్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో కాకతీయ ఉదయం 5 గంటలకు సికింద్రాబాద్ వైపు బయలుదేరుతుంది. సాయంత్రం సికింద్రాబాద్ నుంచి భద్రాచలంరోడ్ స్టేషన్‌కు వస్తుంది. అయితే ఈ రైలుకు స్టాప్‌లు ఎక్కువగా ఉండడంతో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు అంతగా ఆదరించడం లేదు. ఇక మణుగూరు – సికింద్రాబాద్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రాత్రి వేళ నడుస్తోంది. అయినా దీనికి డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. పలుమార్లు బెర్త్‌లు దొరకడమే కష్టంగా మారుతోంది. ఈ రెండు రైళ్లతో పాటు గతంలో మణుగూరు – కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులో ఉండేది. అయితే కరోనా సమయంలో ఈ రైలు రద్దయింది.

ఏడాది క్రితం ప్రారంభం..

కరోనా సంక్షోభం ముగిసిన తర్వాత గతేడాది జనవరి 17న కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు స్థానంలో బెళగావి – మణుగూరు – బెళగావి (07335/07336) ఎక్స్‌ప్రెస్ రైలును రైల్వేశాఖ ప్రకటించింది. అయితే ఇది మూన్నాళ్ల ముచ్చటగానే నిలిచింది. డోర్నకల్ – వరంగల్ మధ్య జరుగుతున్న మూడో లైన్ నిర్మాణ పనుల కారణంగా ఈ రైలు ప్రతీరోజు నిర్ణీత సమయానికి గమ్యాన్ని చేరుకోలేకపోయింది. దీంతో ఆరు నెలల క్రితం భద్రాచలం రోడ్ – మణుగూరు మధ్య ఈ రైలును రద్దు చేశారు. అయినా పరిస్థితిలో మార్పు రాకపోగా, భద్రాచలం రోడ్– కాజీపేట మధ్య కూడా రద్దు చేశారు. అప్పటి నుంచి సాయంత్రం వేళ కొత్తగూడెం నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు, ఉదయం హైదరాబాద్ నుంచి కొత్తగూడెం వచ్చేలా బెళగావి ఎక్స్‌ప్రెస్‌ను తిరిగి ప్రారంభించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

కొత్తగూడెం వరకే

గతంలో మణుగూరు నుంచి రాకపోకలు సాగించిన బెళగావి ఎక్స్‌ప్రెస్‌ను ప్రస్తుతం (కొత్తగూడెం) వరకే పరిమితం చేశారు. ఈ శనివారం బెళగావిలో బయలుదేరనున్న రైలు సికింద్రాబాద్, కాజీపేట మీదుగా ఆదివారం ఉదయం 11:30 గంటలకు భద్రాచలం రోడ్ స్టేషన్‌కు చేరుతుంది. అదేరోజు సాయంత్రం 4:35 గంటలకు కొత్తగూడెంలో బయలుదేరి కాజీపేట, సికింద్రాబాద్, లింగంపల్లి స్టేషన్ల మీదుగా బెళగావి వెళ్తుంది. కాజీపేట – భద్రాచలం రోడ్ మధ్య వరంగల్, కేసముద్రం, మహబూబాబాద్, డోర్నకల్ స్టేషన్లలో ఆగుతుంది. కాగా, రైలును మార్చి 1 వరకే ఈ రైలును నడిపిస్తామని అధికారులు చెబుతున్నా పొడిగించే అవకాశముంది.

క్లుప్తంగా

బీఆర్ఎస్ సమావేశం వాయిదా

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ సమావేశం ఆదివారం జరగాల్సి ఉండగా వాయిదా పడింది. బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికలపై జరిగే సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని ప్రకటించారు. అయితే, ఈ సమావేశం వాయిదా పడిందని, మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

కౌలు చెల్లించని భూమిలో పంటకోత అడ్డగింత



రైతుతో మాట్లాడుతున్న అధికారులు

నేలకొండపల్లి: దేవాదాయ శాఖ భూమిని కౌలుకు తీసుకున్న రైతు కౌలు చెల్లించకుండా పంట కోస్తుండగా అధికారులు అడ్డుకున్నారు. నేలకొండపల్లిలోని శ్రీ రాజగోపాలస్వామి దేవాలయానికి చెందిన 13.25 ఎకరాల భూమికి వేలం నిర్వహించగా రైతు రామారావు రూ.1.86 లక్షలకు పాడాడు. ఆయన ఆ భూమిలో జనుము సాగు చేయగా, శుక్రవారం కోయిస్తుండగా ఆలయ పి.నారాయణచార్యులు అడ్డుకున్నారు. దేవాదాయ శాఖకు కౌలు మొత్తం చెల్లించే వరకు పంట కోయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిబ్బంది కల్యాణి, డి.శ్రీనివాసరావు, అర్చకులు ముడుంబా రామానుజచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో యువతకు మొండిచేయి

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రం తాజాగా ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో నిరుద్యోగులు, సామాన్య ప్రజలకు మేలు జరగకపోగా, కార్పొరేట్లకు మాత్రం అనుకూలంగా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ విమర్శించారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో ఏఐవైఎఫ్ క్యాలెండర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలు లేకున్నా కార్పొరేట్ శక్తులు తమ వెంట ఉండాలనే భావనతో కేంద్రం బడ్జెట్‌ను రూపొందించిందని ఆరోపించారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ మాట్లాడగా నాయకులు కొల్లి రవి, ఎం.శ్రావణ్, గణపరపు ఉపేందర్, మల్లెబోయిన ఉపేందర్, మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ కోసం వీవీసీ రాజా దరఖాస్తు



దరఖాస్తు అందజేస్తున్న రాజేంద్రప్రసాద్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం వీవీసీ గ్రూప్ సంస్థల ఎండీ రాజేంద్రప్రసాద్(రాజా) దరఖాస్తు చేసుకున్నారు. ఆయన శుక్రవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేశారు. వీవీసీ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిన తనకు పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు.

టీపీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న విజయ్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలో ఈనెల 11, 12వ తేదీల్లో జరగనున్న టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఎస్.విజయ్, ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షుడు వి.మనోహర్‌రాజు కోరారు. సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఖమ్మం నయాబజార్ పాఠశాల ప్రాంగణంలో 11న సాయంత్రం 6గంటలకు రాష్ట్ర మహాసభలు మొదలవుతాయని తెలిపారు. ఈ సభలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క తదితరులు హాజరై మాట్లాడుతారని తెలిపారు.

‘ఆట’ సాగడం లేదు..

- జిల్లాలోని క్రీడా ప్రాంగణాల్లో సమస్యలు
- పిచ్చిమొక్కలు పెరిగి.. మట్టిదిబ్బలతో దర్శనం
- పంపిణీకి నోచుకోని క్రీడాకిట్లు
- రూ.కోట్ల నిధులు వెచ్చించినా కానరాని ఫలితం



రఘునాథపాలెం మండలం చెరువుకొమ్ము తండాలోని క్రీడా ప్రాంగణంలో తిరుగుతున్న పశువులు

ఖమ్మం స్పోర్ట్స్: అట్టహాసంగా రెండేళ్ల క్రితం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటుచేసిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(శాట్స్) బాధ్యులు ఆతర్వాత నిర్వహణను మాత్రం మరిచిపోయారు. ఏర్పాటుచేసిన సమయంలోనే అనువైన స్థలాలను గుర్తించలేదనే ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలకు తగినట్లుగానే రాళ్లురప్పలతో నిండిన క్రీడాప్రాంగణాల్లో ఇప్పుడు పిచ్చిమొక్కలు మొలిచి చిట్టడవులను తలపిస్తున్నాయి. దీంతో క్రీడాభివృద్ధి పేరిట వెచ్చించిన రూ.కోట్ల నిధులు మట్టి పాలైనట్లయింది.

మండలానికి 16కు పైగా..

ప్రతీ గ్రామపంచాయతీలో క్రీడా ప్రాంగణం ఉండాలన్న గత ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో 606 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుచేశారు. ప్రతీ మండలంలో కనీసం 16నుంచి 30 వరకు ఏర్పాటయ్యాయి. అయితే, హడావుడిగా బోర్డులు ఏర్పాటుచేసి.. నాలుగు రాడ్లు పాతి మిగతా విషయాలు మరిచిపోయారు. చాలాచోట్ల రాళ్లు, రప్పలతో కూడిన మైదానాన్ని కనీసం చదును చేయాలనే ఆలోచన కూడా రాకపోవడంతో ఔత్సాహిక క్రీడాకారుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. కొందరు సర్పంచ్‌లు, అధికారులు మొక్కుబడిగా ఏర్పాటుచేశారే తప్ప ఆతర్వాత పట్టించుకోలేదు.

బ్యాగ్‌ల్లోనే క్రీడా పరికరాలు

జిల్లావ్యాప్తంగా క్రీడా ప్రాంగణాలకు గత ఏడాది 2023 ఆగస్టులో క్రీడా కిట్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఇందుకోసం జిల్లాకు కిట్లను కేటాయించినా ప్రజాప్రతినిధులకు సమయం లేక పంపిణీ మొదలుకాలేదు. ఇందులో అత్యధికంగా క్రికెట్ కిట్లు ఉండగా... వీటికి రూ.కోటికి వెచ్చించినట్లు సమాచారం. వాలీబాల్, నెట్లు, డిస్కస్ త్రోల తదితర పరికరాలతో కిట్లు సమకూర్చినా జిల్లా కేంద్రంలోనే మూలుగుతున్నాయి.

రెండేళ్లలో ఎందరికి శిక్షణ?

జిల్లాలోని ఒక్క క్రీడా ప్రాంగణంలో కూడా ఇప్పటి వరకు ఏ క్రీడాకారుడు శిక్షణ తీసుకున్న దాఖలాలు లేవనే చెప్పాలి. ఇవి ఏర్పాటై రెండేళ్లు కావొస్తున్నా సుశిక్షితులైన పీఈటీలకు కేటాయించలేదు. దీంతో మార్గనిర్దేశం చేసే వారు లేక ఔత్సాహికులు ఎవరూ ఇటుముఖం చూడడం లేదు. ఇప్పటికైన క్రీడా ప్రాంగణాలకు బదులు మినీ స్టేడియాలు ఏర్పాటు చేసి కోచ్‌లను నియమిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని పలువురు చెబుతున్నారు.

రూ.కోట్ల నిధులు వృథా

క్రీడా ప్రాంగణాల ఏర్పాటు పేరిట రూ.కోట్లలో నిధులు దుబరా చేశారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే ఉన్న స్టేడియంల్లో శిక్షకుల కొరత వేధిస్తుండగా వసతులు కల్పించాల్సి ఉంది. ఈమేరకు ప్రాంగణాల ఏర్పాటు, కిట్ల కొనుగోలుకు వెచ్చించిన రూ.కోట్లాది నిధులను శాట్స్ ఆధ్వర్యాన ఇప్పటికే కొనసాగుతున్న స్టేడియంలో కనీస వసతుల కల్పన, కోచ్‌ల నియామకానికి వెచ్చిస్తే మంచి ఫలితాలు వచ్చేవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

లిఫ్ట్ ఇస్తామంటూ దోపిడీ

- వృద్ధ దంపతుల నుంచి బంగారుగొలుసు, నగదు చోరీ
- మాటల్లో పెట్టి మోసం చేసిన దుండగులు



దాడికి గురైన వృద్ధ దంపతులు



సీసీ పుటేజీ ద్వారా గుర్తించిన వాహనం

తల్లాడ/వైరా: లిఫ్ట్ ఇస్తామని చెప్పి వృద్ధ దంపతులను తీసకెళ్తూ బంగారు నానుతాడు, రూ.5 వేలు నగదు లాక్కుని వాహనం నుంచి నెట్టేసిన దుండగులు పరారయ్యారు. శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జులూరుపాడు మండలం కొత్తూరుకు చెందిన వాంకుడోత్ కేతానాయక్ – బాలి వైరాలోని కంటి ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకుని స్వగ్రామానికి బయలుదేరారు. వైరా బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురు చూస్తుండగా ఇద్దరు యువకకులు వచ్చి తాము కూడా జులూరుపాడు వైపు కారులో వెళ్తున్నామని నమ్మబలికారు. అయితే, తన భార్యకు టికెట్ ఉందని కేతానాయక్ చెబితే ఒకరి టికెట్ ఇస్తేచాలని కారులో ఎక్కించుకున్నారు. ఆతర్వాత బొమ్మ, బొరుసు ఆట పేరుతో కేతానాయక్‌ను మాటల్లో పెట్టి రూ.100, రూ.500 పందెం కాయించారు. ఆతర్వాత ఆయన భార్య మెడలో బంగారు గొలుసు పెట్టాలని సూచిస్తుండగా వాహనం తల్లాడ దాటి కారు కల్లూరు వైపు వెళ్తుండగా వారు ప్రశ్నిస్తే మళ్లీ ఇక్కడకే వస్తామని చెప్పారు. ఆతకాసేపటికి తల్లాడ ఊరిబయట ఆపి ఓ యువకుడు రూ.2లక్షల బంగారు నాను తాడు, రూ.5వేల నగదు లాక్కుని పరారయ్యాడు. వాహనంలో ఉన్న మరో యువకుడు దంపతులను కిందకు నెట్టేసి వెళ్లిపోయాడు. దీంతో కేతానాయక్, బాలి తల్లాడ పోలీసులను ఆశ్రయించగా.. వైరా సీఐ సాగర్, తల్లాడ ఎస్సై కొండల్‌రావు ఆధ్వర్యాన సీసీ పుటేజీలు పరిశీలించి వాహనాన్ని గుర్తించారు. అలాగే, నిందతుల కోసం గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

‘ఉపాధి’ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఓ విద్యాచందన

చింతకాని: మహత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ విద్యాచందన సూచించారు. ఉపాధి హామీ పథకం ప్రారంభమై 18 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలోని కొదుమూరులో శుక్రవారం ఆమె కేక్ కట్ చేసి మాట్లాడారు. కూలీలందరూ వంద రోజుల పనిదినాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఉద్యోగులు కోటయ్య, హుస్సేన్, ఈశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సాధనే లక్ష్యం కావాలి..



మాట్లాడుతున్న ఎస్‌బీఐటీ చైర్మన్ కృష్ణ

ఖమ్మం సహకారనగర్: ప్రతీ విద్యార్థికి ఉద్యోగ సాధనే లక్ష్యం కావాలని ఎస్‌బీఐటీ చైర్మన్ గుండాల కృష్ణ పేర్కొన్నారు. ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో శుక్రవారం ఎఫ్ ట్రానిక్స్ కంపెనీ ఆధ్వర్యాన ప్లేస్‌మెంట్స్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధన కోసం కష్టపడితే ఫలితం ఉంటుందని తెలిపారు. కాగా, 224మంది విద్యార్థులు డ్రైవ్‌లో పాల్గొనగా మొదటి రౌండ్‌లో ప్రతిభ కనబర్చిన వారిని రాతపరీక్షకు ఎంపిక చేశారు. ఈకార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి.ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు శ్రీనివాసరావు, శివప్రసాద్, ప్రవీణ్‌కుమార్, రవీంద్రబాబు, శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఎఫ్ ఎట్రానిక్స్ కంపెనీ హెచ్‌ఆర్ పి.మాధవి పాల్గొన్నారు.

ఢిల్లీలో మధిర కౌన్సిలర్లు



ఎంపీ నామాతో కౌన్సిలర్లు వారి కుటుంబ సభ్యులు

మధిర: ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ఆధ్వర్యాన బీఆర్ఎస్ పార్టీకి చెందిన మధిర మున్సిపల్ కౌన్సిలర్లు ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. ఈసందర్భంగా శుక్రవారం వారు ఎంపీని శుక్రవారం ఉదయం కలిశారు. ఈమేరకు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించినట్లు తెలిసింది.

రిటైర్డ్ ఆర్మీ జవాన్‌కు ఘనస్వాగతం

బోనకల్: మండలంలోని ముష్టికుంట్లకు చెందిన బంధం ఏడుకొండలు – సుశీల దంపతుల కుమారుడైన బంధం నాగేశ్వరరావు ఆర్మీ జవాన్‌గా ఉద్యోగ విరమణ చేసి శుక్రవారం స్వగ్రామానికి వచ్చాడు. ఈసందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికి జాతీయ జెండాల నడుమ ప్రత్యేక వాహనంపై ఊరేగింపుగా తీసుకొచ్చి సన్మానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఉన్నత చదువులు పూర్తిచేసినా దేశానికి సేవ చేయాలనే లక్ష్యంతో 2003లో ఆర్మీ జవాన్‌గా విధుల్లో చేరిన నాగేశ్వరరావు అభినందనీయుడని కొనియాడారు.



ప్రత్యేక వాహనంపై ఆర్మీ జవాన్ దంపతులు

మృతుల కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం



పరిహారం చెక్కులు అందజేస్తున్న అధికారులు

చింతకాని: మండలంలోని వందనం గ్రామానికి చెందిన భార్యాభర్తలు బానోతు సక్రు, రంగమ్మ విద్యుదాఘాతంతో గతేడాది మార్చిలో మృతి చెందగా వారి కుటుంబాలకు విద్యుత్ పరిహారం మంజూరు చేసింది. మేకల పెంపకంతో జీవనం సాగించే సక్రు–రంగమ్మ మేకలను మేతకు తీసుకెళ్లగా విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందారు. ఈమేరకు మంజూరైన రూ.10 లక్షల పరిహారాన్ని విద్యుత్ శాఖ సహాయ సంచాలకులు తిలక్ శుక్రవారం వారి కుటుంబీకులకు అందజేశారు. ఏఈ వెంకన్నతో పాటు కొరిపల్లి శ్రీను, షేక్ అమీన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో డీఏఓ తనిఖీ

కూసుమంచి: మండలంలోని కూసుమంచి, పాలేరు, నర్సింహులగూడెం గ్రామాల్లో ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) విజయనిర్మల శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు, స్టాక్‌ను పరిశీలించాక ఆమె మాట్లాడారు. వ్యవసాయశాఖ నూతనంగా ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం యాప్ ద్వారాఅన్ని వివరాలు నమోదు చేస్తున్నామని తెలిపారు. ఈమేరకు డీలర్లు కూడా రికార్డులు పక్కాగా నిర్వహించాలని, ఎక్కడైనా తేడా ఉంటే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఏడీఏ విజయచంద్ర, ఏఓ వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

సిరిపురంలో పట్టపగలే చోరీ

మధిరరూరల్: మండలంలోని సిరిపురానికి చెందిన కుడుపుగంటి చిన్న బుజ్జి బాబు ఇంట్లో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. ఆయన కుటుంబ సభ్యులు రోజులగే తాళం వేసి కూలి పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించి దుండగులు తలుపు, ఇంట్లోని బీరువా తాళం పగలగొట్టి రూ.60 వేల నగదు ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చాక బుజ్జిబాబు తలుపు తాళం పగలగొట్టి ఉండడంలో లోపల పరిశీలించగా చోరీ జరిగినట్లు తేలింది. ఈ ఘటనపై మధిర రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు.

టీజీసీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా గోపి



ఖమ్మం సహకారనగర్: తెలంగాణ గవర్నమెంట్ కాలేజెస్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్(టీజీసీజీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఎన్.గోపి ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని యూనియన్ బాధ్యులు ఎం.రవీంద్రారెడ్డి, సీహెచ్.శ్రీనివాసులు తెలిపారు. ఈమేరకు శుక్రవారం కళాశాలలో గోపిని అధ్యాపకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శాంతికుమార్, వీరబ్రహ్మం, అనురాధ, కిరణ్‌కుమార్, బాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య



శ్రీధర్ (ఫైల్)

మధిర: మధిరలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణానికి చెందిన మల్లాది శ్రీధర్(52) మధిర ఎస్‌బీఐలో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా సెలవులో ఉన్న ఆయన జనవరి 31న స్వగ్రామంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఆయనను విజయవాడలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన బ్యాంకు ఉద్యోగులు శ్రీధర్ మృతిపై సంతాపం ప్రకటించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

చింతకాని: మండలంలోని చినమండవ, తిమ్మినేనిపాలెంల్లో మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్లను నాగులవంచ కొత్త వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపాన సీజ్ చేయడమే కాక బాధ్యులపై కేసు నమోదు చేశామని ఎస్సై రాజేందర్ తెలిపారు.

జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన పాఠశాల డైరెక్టర్ శ్రీధర్‌రావు తదితరులు

ఖమ్మం సహకారనగర్: విజయవాడలో ఇటీవల జరిగిన సౌత్ ఇండియా స్థాయి సైన్స్ ఫేర్‌లో తృతీయ స్థానం కైవసం చేసుకుని జాతీయ స్థాయికి ఎంపికైన రెజొనెన్స్ శ్రీనగర్ పాఠశాల విద్యార్థులను కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అభినందించారు. కలెక్టరేట్‌లో ఆయన 9వ తరగతి చదువుతున్న డి.శ్రీవల్లి, జి.గాయత్రిని అభినందించగా... విద్యార్థులు బేబీ మానిటరింగ్ సిస్టమ్‌తో శిశువులను పర్యవేక్షించే ప్రాజెక్టు వివరాలు వెల్లడించారు. అలాగే, విద్యార్థులను డీఈఓ సోమశేఖరశర్మ కూడా అభినందించగా, పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణి, హెచ్‌ఎం ప్రసన్నరావు, ఉపాధ్యాయులు హరిబాబు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా స్థాయి సైన్స్ ఫేర్‌లో సత్తా

సౌత్ ఇండియా స్థాయి సైన్స్ ఫేర్‌లో ఖమ్మం ఆర్ఆర్ హైస్కూల్ బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు మీర్ హబీబ్ ప్రదర్శించిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్ఎం) ప్రాజెక్ట్ ప్రశంసలు అందుకుందని పాఠశాల కరస్పాండెంట్ చావా సత్యవతి, డైరెక్టర్ చావా సత్యనారాయణ ప్రసాద్ తెలిపారు. సౌత్ ఇండియా స్థాయికి ఉపాధ్యాయుల విభాగంలో హబీబ్ మాత్రమే ఎంపికయ్యారని పేర్కొన్నారు.



అవార్డు అందుకుంటున్న మీర్ హబీబ్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పెద్దకృష్ణ (ఫైల్)

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఇస్నేపల్లి పెద్ద కృష్ణ(31) అలియాస్ ప్రసన్నకుమార్ తల్లాడ వైపు నుంచి అన్నారుగూడెం వైపు ఆటోలో వెళ్తుండగా కాల్వ కట్ట వద్ద ఆటో పల్టీ కొట్టింది. ఈఘటనలో పెద్ద కృష్ణ తలకు తీవ్ర గాయాలుగా ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇదే ఘటనలో కృష్ణ భార్యకు సైతం గాయాలయ్యాయి. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండల్‌రావు తెలిపారు.

14 కేజీల గంజాయి స్వాధీనం

తిరుమలాయపాలెం: మండలంలోని మాదిరిపురం సమీపాన తిరుమలాయపాలెం పోలీసులు 14 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన విష్ణు విఠల్‌రావు మ్యాత్రో, సచిన్‌కాంత తోమ్రో భద్రాచలం పరిసర ప్రాంతాల్లో గంజాయిని సేకరించి మరిపెడ బంగ్లా మీదుగా హైదరాబాద్ తరలించేందుకు లారీలు, ఆటోల్లో ప్రయాణిస్తూ మాదిరిపురం వచ్చారు. అక్కడి హోటల్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వీరిని పోలీసులు అదుపులోకి తనిఖీ చేయగా 14 కేజీల గంజాయి పట్టుబడింది. దీంతో నిందితులను అరెస్ట్ చేసినట్లు కూసుమంచి సీఐ జితేందర్‌రెడ్డి తెలిపారు.

ముగ్గురి అదృశ్యంపై కేసులు

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు అదృశ్యమైన ఘటనలపై ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం పోలీసులు శుక్రవారం కేసులు నమోదు చేశారు. ఖమ్మంలోని కొత్తగూడెంకు చెందిన సుతారి ముద్రబోయిన ఎల్లయ్య, రఘునాథపాలెం మండలం ఈర్లపుడికి చెందిన బీటెక్ విద్యార్థిని, చిమ్మపుడిలో మిర్చికోతల కోసం వచ్చిన మధ్యప్రదేశ్ రాష్ట్రం చిల్పి గ్రామానికి చెందిన మహాసింగ్ కానరాకుండా పోవడంతో వారి కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఫ్లెక్సీ చింపిన వ్యక్తిపై కేసు నమోదు

రఘునాథపాలెం: మండలంలోని రేగులచలకలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీని చింపిన వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. గ్రామంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫొటోతో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అదే గ్రామానికి చెందిన సున్నా కిషోర్ గతనెల 19న, 31వ తేదీన రెండు సార్లు ఫ్లెక్సీలు చింపినట్లు గుర్తించగా... అడిగిన వారిని చంపుతానని బెదిరించాడు. దీంతో యండపల్లి జగన్‌మోహన్‌రావు ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ప్రాణాపాయ స్థితిలో చిన్నారి

ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు

దీనగాథ



చికిత్స పొందుతున్న లక్షిత

కూసుమంచి: గుండె సంబంధిత వ్యాధితో పాటు బ్లడ్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న 16 నెలల చిన్నారికి వైద్యం చేయించే స్థోమత లేక తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. చికిత్స కోసం దాతలు చేయూతనివ్వాలని కోరుతున్నారు. కూసుమంచి మండలం జక్కేపల్లికి చెందిన వెంపల్ల నరేష్‌రెడ్డి – శ్రీదేవి దంపతుల కుమార్తె లక్షిత గుండె సంబంధిత వ్యాధితో జన్మించింది. ఆమె వయస్సు 16 నెలలు కాగా పుట్టిన నాటి నుండి తల్లిదండ్రులు ఆస్పత్రుల్లో వైద్యం చేయిస్తున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన వారు ఇప్పటికే ఉన్న కొద్దిపాటి ఆస్తులు అమ్మేసి రూ.4లక్షల వరకు వెచ్చించారు. అయినా లక్షితకు నయం కాకపోగా మూడు నెలల కిత్రం బ్లడ్ ఇన్‌ఫెక్షన్ సోకింది. దీంతో పాప ఆరోగ్య మరింత క్షీణిస్తూ ప్రాణాపాయ స్థితికి చేరింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా మెరుగైన వైద్యం కోసం రూ.6లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో చేతిలో చిల్లిగవ్వ లేని నరేష్‌రెడ్డి దంపతులు తమ పాపను ఎలా దక్కించుకోవాలో తెలియక కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈమేరకు చేయూత నివ్వాలనుకునే వారు 80969 92160 నంబర్‌కు ఫోన్‌పే లేదా గూగుల్ పే నగదు పంపించాలని కోరుతున్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా...

అంబేడ్కర్ వర్సిటీ బీఎడ్ ఎంట్రన్స్ నోటిఫికేషన్

ఫిబ్రవరి 21 వరకు దరఖాస్తులకు గడువు.. మార్చి 5న పరీక్ష



బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బీఎడ్ (ఓడీఎల్) అర్హత పరీక్ష 2023–24కు నోటిఫికేషన్ విడుదలైంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఫిబ్రవరి 21గా విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష రుసుము రూ.1000, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.750 అని వివరించారు. మార్చి 5వ తేదీన రెండు తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాల్లో బీఎడ్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తారని వెల్లడించారు. విద్యార్థులు పరీక్షకు రెండు రోజుల ముందు హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఆర్ఏఓయూ.ఏసీ.ఇన్ లేదా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఆర్ఏఓయూఆన్‌లైన్.ఇన్‌లో సంప్రదించాలని సూచించారు.

జపాన్‌లో హాస్పిటాలిటీ ఉద్యోగాలకు దరఖాస్తులు

5న నిథిమ్‌లో ఎంపికలు

సాక్షి, హైదరాబాద్: జపాన్‌లో హాస్పిటాలిటీ ఉద్యోగాల భర్తీకి ఆసక్తి ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో డిగ్రీ/డిప్లొమా చేసిన అనువజ్ఞులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఒక ప్రకట నలో తెలిపింది. అభ్యర్థుల కనీస వయసు 22 ఏళ్ల నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలని, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో డిగ్రీ లేదా డిప్లొమా చేసి అనుభవం కలిగి ఉండాలని వివరించింది. ఆసక్తి ఉన్న వారు టామ్‌కామ్ హెచ్‌ఆర్ మేనేజర్ ఫోన్ నంబర్ 8125251408లో సంప్రదించాలని, లేదా ఈమెయిల్ ద్వారా పంపించవచ్చని వివరించింది. ఎంపిక ప్రక్రియను ఈనెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథిమ్)లో నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఎంపికైన వారికి జపనీస్ భాషపై రెసిడెన్షియల్ శిక్షణ ఇచ్చి అక్కడ పనిచేసేందుకు అవసరమైన అదనపు నైపుణ్యాలను నేర్పించనున్నట్లు వెల్లడించింది.

కుప్పాన్ని ఎండబెట్టి

కుప్పి గంతులు!

రాజకీయ భిక్ష పెట్టిన పురిటిగడ్డకు చంద్రబాబు నయవంచన

కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా కృష్ణా జలాలను తరలిస్తానంటూ నమ్మక ద్రోహం

- సాగు, తాగునీరు ముసుగులో అంచనా వ్యయం భారీగా పెంపు
- సీఎం రమేష్‌ను అడ్డుపెట్టుకుని ఖజానాకు కన్నం
- కుప్పంను మున్సిపాలిటీగా చేసి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసిన సీఎం జగన్
- కుప్పం బ్రాంచ్ కెనాల్ యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి కృష్ణా జలాల తరలింపు



కుప్పం బ్రాంచ్ కెనాల్ (ఫైల్)

సాక్షి, అమరావతి: కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా కృష్ణా జలాలను తరలించి సాగు, తాగునీరు అందిస్తానని నమ్మబలికిన స్థానిక టీడీపీ ఎమ్మెల్యే, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ఆ ముసుగులో ఖజానాను దోచేసి పనులు చేయలేక చేతులెత్తేసి నయవంచనకు పాల్పడ్డారు! 2022 సెప్టెంబరు 23న కుప్పం నియోజకవర్గ పర్యటన సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. పూర్తయిన కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను ఈ నెలలోనే సీఎం జగన్ ప్రారంభించి నియోజకవర్గ ప్రజలకు అంకితం చేయనున్నారు. ఇప్పటికే రామకుప్పం మండలం వరకూ కృష్ణా జలాలను తరలించారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా చెరువులు నింపి సమృద్ధిగా సాగు, తాగునీరు అందించనున్నారు.

పురిటిగడ్డకు ద్రోహం

సొంతూరు నారావారిపల్లె ఉన్న చంద్రగిరి నియోజకవర్గం నుంచి 1983 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన చంద్రబాబు నాడు టీడీపీ అభ్యర్థి మేడసాని వెంకట్రామనాయుడి చేతిలో 17,429 ఓట్ల తేడాతో ఘోరంగా ఓడిపోయారు. ఆ దెబ్బకు 1985 ఎన్నికల్లో పోటీ చేయడానికే జంకిన చంద్రబాబు పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్ పంచన చేరి 1989లో తమిళనాడు, కర్ణాటక, రాష్ట్ర సరిహద్దుల్లోని కుప్పం నియోజకవర్గానికి వలస వెళ్లారు. అప్పటి నుంచి గూండాయిజం, నోట్ల కట్టలు, దొంగ ఓట్లతో నెగ్గుకొస్తున్నారు. దుర్భిక్ష రాయలసీమను సుభిక్షం చేయడానికి జలయజ్ఞంలో భాగంగా దివంగత వైఎస్సార్ చేపట్టిన హంద్రీ–నీవా సుజల స్రవంతిలో అంతర్భాగమైన కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా సాగు, తాగునీరు అందిస్తానని చంద్రబాబు నమ్మబలికారు. కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను 123.641 కి.మీ. పొడవున తవ్వేందుకు 98,85,140 క్యూబిక్ మీటర్ల మట్టి పని, 3,84,457 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేయాలి. 2015–16 ఎస్ఎస్ఆర్ (స్టాండర్డ్ షెడ్యూల్డ్ రేట్స్) ప్రకారం కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో మట్టి, కాంక్రీట్ పనులకు రూ.203.11 కోట్లు ఖర్చు అవుతుంది. మూడు పంప్‌హౌస్‌ల నిర్మాణం, మోటార్లు, ప్రెజర్‌మైన్లు, విద్యుత్ సరఫరా ఏర్పాటుకు రూ.90 కోట్ల వ్యయం అవుతుంది. 2015–16 ధరల ప్రకారం కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులకు రూ.293.11 కోట్ల వ్యయం అవుతుంది. కానీ అప్పటి సీఎం చంద్రబాబు ఒత్తిడితో పనుల అంచనా వ్యయాన్ని రూ.413 కోట్లకు పెంచేశారు.

కడప టీడీపీ అధ్యక్షుడికి కానుక..

అంచనా వ్యయం పెంచేసిన పనులను కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డికి చెందిన ఆర్కే ఇన్‌ఫ్రాకు కట్టబెట్టి రూ.120 కోట్లు కాజేయడానికి చంద్రబాబు స్కెచ్ వేశారు. ఆ మేరకు కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులకు రూ.413 కోట్లు అంచనా విలువగా నిర్ణయించి 2015 ఆగస్టులో టెండర్లు పిలిచారు. ఆర్కే ఇన్‌ఫ్రా సంస్థకే పనులు దక్కేలా టెండర్లలో నిబంధనలు పెట్టారు. టెండర్లలో ఆ సంస్థ ఒక్కటే నాలుగు శాతం అధిక(ఎక్సెస్) ధరకు కోట్ చేస్తూ షెడ్యూలు దాఖలు చేసింది. చంద్రబాబు ఒత్తిడి మేరకు ఆర్కే ఇన్‌ఫ్రాకు నాలుగు శాతం అధిక ధరకు రూ.430.26 కోట్లకు పనులు కట్టబెట్టారు. మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద రూ.43 కోట్లు దక్కించుకున్న శ్రీనివాసరెడ్డి వాటిని బాబు జేబులో వేసేశారు. అయితే, శ్రీనివాసరెడ్డికి భారీ ఎత్తున లబ్ధి చేకూర్చుతూ కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు కట్టబెట్టడంపై అప్పటి టీడీపీ ఎంపీ సీఎం రమేష్ పేచీ పెట్టారు. దీంతో శ్రీనివాసరెడ్డికి చెందిన ఆర్కే ఇన్‌ఫ్రాకు 50% పనులు, మిగతా 50% పనులు సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్‌కు సబ్ కాంట్రాక్టు కింద ఇవ్వాలని బాబు ఆదేశించారు. తనతోపాటు శ్రీనివాసరెడ్డి భారీ ఎత్తున లబ్ధి పొందుతుండటాన్ని సహించలేని సీఎం రమేష్ మొత్తం పనులను తనకే కట్టబెట్టాలని మరోసారి పేచీకి దిగారు. దీంతో పనులన్నీ రిత్విక్ ప్రాజెక్ట్స్‌కే అప్పగించేశారు.

రూ.460.88 కోట్లు నీళ్ల పాలు..

కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో సీఎం రమేష్ సంస్థకు రూ.460.88 కోట్లను 2019 ఏప్రిల్ నాటికి ప్రభుత్వం బిల్లుల రూపంలో చెల్లించింది. అంటే కాంట్రాక్టు విలువ కంటే రూ.30 కోట్లు ఎక్కువగా చెల్లించినా పనులు పూర్తి కాలేదు. రూ.99.41 కోట్ల విలువైన పనులు మిగిలిపోయాయి. నాసిరకమైన పైపులు వేయడం వల్ల వర్షపునీటికే పగిలిపోయాయి. దీన్ని బట్టి కుప్పం బ్రాంచ్ కెనాల్ పనుల్లో సీఎం రమేష్‌తో కలిసి చంద్రబాబు ఏ స్థాయిలో దోపిడీకి పాల్పడ్డారో విశదం చేసుకోవచ్చు. వరుసగా ఏడు సార్లు గెలిపించిన కుప్పం ప్రజలకు సాగునీటి మాట దేవుడెరుగు గుక్కెడు తాగునీళ్లు కూడా అందించకుండా చంద్రబాబు నమ్మకద్రోహం చేశారు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగన్..

ముఖ్యమంత్రి జగన్ అధికారం చేపట్టాక ప్రతిపక్షనేత చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం బాగోగులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కుప్పంను మున్సిపాల్టీని చేశారు. కుప్పం కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేశారు. మున్సిపాల్టీతో పాటు గ్రామాల్లో అంతర్గత రహదారులు, తాగునీరు లాంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశారు. కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను పూర్తి చేసి కృష్ణా జలాలను అందించి సుభిక్షం చేస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చారు. మాట నిలబెట్టుకుంటూ యుద్ధప్రాతిపదికన కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను పూర్తి చేయించారు. ఇప్పటికే కుప్పం బ్రాంచ్ కెనాల్ 74 కి.మీ. వరకూ అంటే రామకుప్పం మండలం మనేంద్రం గ్రామం వరకూ కెనాల్ నీటిని తరలించారు. చెరువులను నింపి సాగు, తాగునీరు అందించనున్నారు.

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తల నియామకం

- ఆరో జాబితాలో ఆరు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు ఎంపిక
- రాష్ట్ర మంత్రి మేరుగు నాగార్జున, ప్రభుత్వ సలహాదారు సజ్జల వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో ఆరు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. ఆ వివరాలను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద శుక్రవారం సాయంత్రం వెల్లడించారు. ప్రజాబలమే గీటురాయిగా.. సామాజిక న్యాయం పాటిస్తూ... ఆరో జాబితా తయారు చేసినట్టు ఈ సందర్భంగా వారు తెలిపారు. గత ఎన్నికల్లో నర్సాపురం లోక్‌సభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా... ఈ సారి బీసీ వర్గానికి చెందిన మహిళా అడ్వొకేట్ గూడూరి ఉమాబాలను ఎంపిక చేశారు. రాజమండ్రి లోక్‌సభ స్థానానికి డాక్టర్ గూడూరి శ్రీనివాస్(బీసీ)ను, గుంటూరుకు ఉమ్మారెడ్డి రమణ, చిత్తూరుకు సిటింగ్ ఎంపీ ఎన్.రెడ్డప్పను ఎంపిక చేశారు. గత ఎన్నికల్లో మైలవరం శాసనసభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా.. ఈ సారి సర్నాల తిరుపతిరావు యాదవ్(బీసీ)ను నియమించారు. గత ఎన్నికల్లో ఎమ్మిగనూరు శాసనసభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా.. ఇప్పుడు మాజీ ఎంపీ బుట్టా రేణుకను నియమించారు. మార్కాపురానికి ఎమ్మెల్యే అన్నా రాంబాబు, గిద్దలూరుకు ఎమ్మెల్యే కె.నాగార్జునరెడ్డి, గంగాధర నెల్లూరు(ఎస్సీ)కు డిప్యూటీ సీఎం కె.నారాయణ స్వామి, నెల్లూరు సిటీకి ఎండీ ఖలీల్‌ను నియమించారు. ఇప్పటివరకూ 63 శాసనసభ, 16 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తలను కొత్తగా నియమించినట్టయింది. ఇప్పటిదాకా ప్రకటించిన శాసనసభ స్థానాల సమన్వయర్తల్లో 21 మంది ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలు, 18 మంది బీసీలు, ఐదుగురు మైనార్టీలు, 16 మంది ఓసీలకు చెందిన వారు ఉన్నారు. 16 లోక్‌సభ స్థానాలకు నియమించిన సమన్వయకర్తల్లో బీసీలు తొమ్మిది మంది, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ఓసీలు నలుగురు ఉన్నారు.

వ్యవసాయ, ఉద్యాన వర్సిటీ వీసీల నియామకానికి నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ల నియామకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు నోటిఫికేషన్ విడుదల చేశారు. వీసీగా నియామకమయ్యే అభ్యర్థులు యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా కనీసం 10 ఏళ్ల పాటు పనిచేసి ఉండాలి. అభ్యర్థుల వయోపరిమితి 65 ఏళ్లకు మించకుండా ఉండాలి. అసక్తిగల అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో వెల్లడించారు.

కాపాడలేం.. అమ్మేద్దాం!

▶ మొదటి పేజీ తరువాయి

వెల్లడించింది. తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేయటంతో ఈ అంశం అలాగే తొమ్మిదో షెడ్యూల్‌లో తెగని పంచాయితీగా ఉండిపోయింది. హైకోర్టులో కేసు కూడా కొనసాగుతోంది. ఇలాంటి తరుణంలో సదరు భూములను అమ్మేయాలని తెలంగాణ సర్కారు నిర్ణయించడం చర్చనీయాంశంగా మారుతోంది.

కాపాడలేమంటూ కేంద్రం దృష్టికి..

హౌసింగ్‌బోర్డు, దిల్ భూములు కీలక ప్రాంతాల్లో ఉండటంతో వాటిపై కబ్జారాయుళ్ల దృష్టి పడింది. ఇప్పటికే చాలా భూములపై వివాదాలు మొదలయ్యాయి. ఈ భూముల విక్రయానికి ప్రక్రియ మొదలుపెట్టగానే.. అభ్యంతరాలు వస్తాయని, కోర్టులో కేసు ఉండగా ఎలా అమ్ముతారన్న ప్రశ్న వస్తుందని సర్కారు ముందుగానే అంచనా వేసింది. ఈ క్రమంలోనే ఇటు కోర్టుకు, అటు కేంద్ర ప్రభుత్వానికి కూడా ఈ భూముల పరిరక్షణ సవాల్‌గా మారిందన్న విషయాన్ని తెలియపర్చాలని భావిస్తోంది. ''ఇప్పటికే చాలా భూములు వివాదంలో ఉన్నాయి. వాటితోపాటు క్లియర్‌గా ఉన్న మిగతా భూములను పరిరక్షించటం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. కబ్జాలు ఇంకా పెరిగి వివాదాలు కోర్టుల్లో పెరిగేంత వరకు ఉపేక్షించటం సరికాదు. ఈ భూములకు సంబంధించి కోర్టు ఏ నిర్ణయం తీసుకున్నా అనుసరిస్తాం. ముందు వాటిని వేలం ద్వారా విక్రయించి, వచ్చిన డబ్బును తదనుగుణంగా వినియోగించుకోవచ్చు. అందుకు వీలు కల్పించాలి''అని కోర్టును కోరాలని యోచిస్తోంది. కేంద్రానికి కూడా ఇదే వివరించాలని.. ఈ మొత్తం వ్యవహారాన్ని ఢిల్లీ స్థాయిలో పర్యవేక్షించేందుకు ఓ ప్రతినిధిని కూడా నియమించాలని రాష్ట్ర సర్కారు భావిస్తున్నట్టు సమాచారం.

జిల్లా వార్తలు

ఐటీడీఏలో స్క్రాప్‌కు వేలం

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏలో ఉన్న స్క్రాప్‌ను ఈనెల 10న బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు పీఓ ప్రతీక్‌జైన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పాత కంప్యూటర్ చైర్స్, ప్రింటర్, యూపీఎస్, మానిటర్లు, జిరాక్స్ మిషన్ తదితర సామగ్రిని ఈనెల 10న మధ్యాహ్నం బహిరంగ వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి



పశు వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న కిషోర్

చండ్రుగొండ: పాడిపశువుల పెంపకంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని పశుగణాభివృద్ధి సంస్థ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యనిర్వహణాధికారి డాక్టర్ కె.కిషోర్ సూచించారు. చండ్రుగొండ మండలంలోని గుర్రాయిగూడెంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పశు వైద్యశిబిరంలో పశువులకు వైద్యం అందించడమే కాక కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన దూడలను పరిశీలించారు. ఈసందర్భంగా కిషోర్ మాట్లాడుతూ పశువులకు నాటు వైద్యం చేయించకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మండల పశువైద్యాధికారి ఎల్‌వీఎస్.రాంప్రసాద్, ఉద్యోగులు బి.సాయి, యాదగిరి, రాము, నరేష్, ఆకుల శ్రీనివాసరావు, వెంకటదాసు, ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వద్దకే పోస్టాఫీస్!



ఖాతా కోసం వివరాలు నమోదు చేస్తున్న ఉద్యోగులు

రఘునాథపాలెం: ఉపాధి హామీ పథకంలో పనులు చేసే కూలీలకు నగదు ఖాతాల్లో జమ అవుతోంది. ఇందుకోసం కూలీలు పోస్టాఫీస్‌కు వెళ్లి ఖాతా తెరవాల్సి వస్తోంది. ఫలితంగా ఒక రోజు పని కోల్పోతున్నారు. దీంతో పోస్టల్ ఉద్యోగులే శుక్రవారం రఘునాథపాలెం వచ్చి కూలీల పేరిట ఖాతాలు తెరిచారు. దీంతో తమకు శ్రమ తప్పినట్లయిందని కూలీలు హర్షం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ డెయిరీతో పాలధారలు!

- మహిళలు, యువతకు ఉపాధి కూడా...
- ఇటీవల అధికారులతో సమీక్షించిన డిప్యూటీ సీఎం భట్టి
- గతంలో సభ్యులుగా 4,133 మంది మహిళలు, రూ.36 లక్షల డిపాజిట్
- డిప్యూటీ సీఎం కల ఫలిస్తే మహిళలు, యువత ఆర్థికాభివృద్ధి



ఇందిరమ్మ డెయిరీ ఏర్పాటుపై కలెక్టర్, అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క (ఫైల్)



పాడి గేదెలు

ఎర్రుపాలెం: ఇందిరమ్మ డెయిరీ పేరిట పాడి పరిశ్రమ ఏర్పాటు చేసి మహిళలు, యువతకు ఉపాధి కల్పించాలనే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పదేళ్ల కల త్వరలోనే సాకారం కానుంది. మధిర నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లోని డ్వాక్రా మహిళల ద్వారా ఇందిరమ్మ డెయిరీ పరిశ్రమ ఏర్పాటుచేసి వారికి ఉపాధి కల్పిస్తే ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందని.. యువతకు ఉపాధి సైతం లభిస్తుందని భట్టి డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నప్పుడు కార్యాచరణ సిద్ధం చేశారు. ఆతర్వాత కాంగ్రెస్ అధికారంలోకి కోల్పోగా ఈ ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదు. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రావడం భట్టికి డిప్యూటీ సీఎంగా పదవి దక్కడంతో ఇందిరమ్మ డెయిరీ ప్రతిపాదనలు మళ్లీ తెరపైకి వచ్చాయి.

డెయిరీ ఏర్పాటు ఉద్దేశమిదీ..

ప్రతి మహిళకూ రెండు పాడి గేదెలను బ్యాంకు లింకేజీ రుణం ద్వారా ఇప్పిస్తారు. తద్వారా పాడి పరిశ్రమను వృద్ధి చేసి తద్వారా మహిళలకు ఆర్థిక చేయూతనందించాలన్నది డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భావన. గ్రామాల్లో మహిళలు పాడి గేదెలు కొనుగోలు చేసేలా రుణాలు ఇప్పించడం. యువత ద్వారా పాల సేకరణ, పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయిస్తే ఇరువర్గాలకు ఉపాధి లభిస్తుంది. ఇందులో భాగంగా జనవరి 6వ తేదీన ఎర్రుపాలెం మండలంలోని మామునూరులో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఇతర అధికారులతో సమీక్షించిన భట్టి డెయిరీ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. త్వరలోనే జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించి డెయిరీ ఏర్పాటుకు అడుగులు పడే అవకాశముంది.

పదేళ్ల క్రితమే సభ్యత్వాలు

2012–2013 సంవత్సరంలో ఇందిరమ్మ డెయిరీ(పాల శీతలీకరణ కేంద్రం) ఇండస్ట్రీ కోఆపరేటివ్ సొసైటీని అప్పటి డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే భట్టి విక్రమార్క ఆదేశాలతో ఐకేపీ సిబ్బంది ఏర్పాటు చేశారు. మధిర నియోజవర్గ పరిధిలోని ఎర్రుపాలెం మండలంలో 601 మంది, మధిర మండలంలో 745 మంది, బోనకల్‌లో 908, చింతకానిలో 924, ముదిగొండలో 955 మంది మొత్తం 4,133 మహిళలు రూ.100 సభ్యత్వ రుసుము చెల్లించి సభ్యులుగా చేరారు. అలాగే, వాటా మూలధనంగా కొందరు రూ.500, మరి కొందరు రూ.వెయ్యి చెల్లించారు. ఈ నగదు మొత్తం రూ.29.70లక్షలు కాగా మధిరలోని రెండు జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ చేశారు. ప్రస్తుతం ఆ నిధులు రూ.36లక్షలకు చేరాయి. దీంతో ఇందిరమ్మ డెయిరీ త్వరగా ఏర్పాటుచేసి మండలాల్లోని సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులందరినీ భాగస్వాములు చేసేలా కార్యాచరణ సిద్ధమవుతోంది. తద్వారా ఐదు మండలాల పరిధి 5,884 గ్రూపుల్లోని 61,409 మహిళలను డెయిరీ పరిశ్రమలో సభ్యులుగా చేర్పించి వాటా మూలధనం సేకరిస్తే పరిశ్రమ ఏర్పాటు సులువు కానుంది.

పాడి పరిశ్రమ ఏర్పాటుతో ఉపాధి



ఇందిరమ్మ డెయిరీ ఏర్పాటైతే ఇక్కడి మహిళలకు ఆర్థికపరమైన చేయూత లభిస్తుంది. గ్రామాల్లో పాల ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయి. యువత ద్వారా గ్రాసం కేంద్రాల ఏర్పాటు, పాల సేకరణ చేయిస్తే వారికీ ఉపాధి లభిస్తుంది.

– శీలం కనకదుర్గ, గ్రామ దీపిక, తెల్లపాలెం

త్వరలోనే అధికారులతో సమీక్ష



డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు త్వరలోనే జిల్లాకేంద్రంలో కలెక్టర్ ఆధ్వర్యాన ఐకేపీ, పశు సంవర్థక శాఖ, బ్యాంకు అధికారులతో సమావేశం జరగనుంది. డెయిరీ పరిశ్రమ ఏర్పాటుకు తరఫున ప్రణాళిక రూపొందిస్తున్నాం.

– విద్యాచందన, డీఆర్‌డీఓ, ఖమ్మం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..



ఎర్రుపాలెం మండలంలో 11,632 మంది మహిళలు ఎస్‌హెచ్‌జీల్లో సభ్యులుగా ఉండగా.. 601 మంది ఇందిరమ్మ డెయిరీలో సభ్యులుగా కొనసాగుతున్నారు. ప్రభుత్వ విధివిధానాల మేరకు అందరినీ భాగస్వాములుగా చేస్తాం.

– కె.వెంకటేశ్వర్లు, ఏపీఎం, ఐకేపీ, ఎర్రుపాలెం

'సఖి'తో గిరిజన మహిళల్లో చైతన్యం

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: మారుమూల ఆదివాసీ, గిరిజన గ్రామాలలోని నిరుపేదలైన మహిళలకు ఉన్న హక్కులు, చట్టాలపై సఖి–వన్ స్టాప్ కేంద్రం ద్వారా చైతన్యం కల్పించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. సఖి సెంటర్ నిర్వాహకులు రూపొందించిన పోస్టర్లను శుక్రవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. గిరిజన గ్రామాల్లో మహిళలు నిరక్షరాస్యత కారణంగా అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. ఈ మేరకు వారికి ఉన్నహక్కులపై అవగాహన కల్పించాలని, తద్వారా నష్టపోకుండా చూడాలని సూచించారు. భద్రాద్రి జిల్లా సఖి–వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ శుభశ్రీ మాట్లాడుతూ బాధిత మహిళలకు అత్యవసర పరిస్థితుల్లో వైద్యం, పోలీస్, న్యాయ సేవలు అదందిస్తున్నామని తెలిపారు. ఈమేరకు సేవలు అవసరమైన వారు హెల్ప్‌లైన్ నంబర్ 181కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాజమణి తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. చిన్నఫకీరయ్య



చిన్నఫకీరయ్యను సన్మానిస్తున్న గ్రామస్తులు

ముదిగొండ: ముదిగొండ మండలం గంధసిరిలో కూలీలతో వెళ్తున్న ఆటో గురువారం సాయంత్రం వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లిన విషయం విదితమే. అందులో ఉన్న కొందరు కూలీలకు ఈత రావడంతో బయటపడగా.. మిగతా వారు ఆపదలో చిక్కుకున్నారు. దీంతో అదే సమయాన సమీపంలో ఉన్న గ్రామానికి చెందిన రైతు కుక్కల చిన్నఫకీరయ్య కూలీల కేకలు వినగానే పరుగున అక్కడకు చేరుకున్నారు. బావి నిండా నీరు ఉన్నప్పటికీ అధైర్యపడకుండా దూకి ఎనిమిది మంది కూలీలను బయటకు తీసుకొచ్చాడు. ఈమేరకు చిన్నఫకీరయ్యను నాయకులు, గ్రామస్తులు శుక్రవారం గ్రామంలో ఘనంగా సన్మానించారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు ధైర్యం చేసిన ఆయనను అభినందించారు.

'భద్రాద్రి'కి పోటెత్తుతున్న భక్తులు

- జనవరిలో స్వామిని దర్శించుకున్న 3 లక్షల మంది
- అత్యధికంగా 27వ తేదీన 16,696 మంది భక్తుల రాక



గత నెల 27న స్వామి కల్యాణానికి హాజరైన భక్తులు(ఫైల్)

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. ముక్కోటి, శ్రీరామనవమి ఉత్సవాల సమయాన భక్తులు అధిక సంఖ్యలో రావడం ఆనవాయితీ. మిగతా సమయాల్లో భక్తుల సంఖ్య తక్కువగానే ఉంటుంది. కానీ జనవరి నెలలో మాత్రం సుమారు 3లక్షల భక్తులు స్వామిని దర్శించుకోవటం విశేషం.

అత్యధికంగా జనవరి 27వ తేదీన 16,696మంది, అత్యల్పంగా 30వ తేదీన 5,314 మంది దర్శించుకున్నారు. జనవరిలో వారాంతపు సెలవులతో పాటుగా ఇతర సెలవులు రావడంతో భక్తుల రద్దీ నెలకొందని భావిస్తున్నారు. స్వామిని దర్శించుకోవడమే కాక నిత్యకల్యాణంలో పెద్దసంఖ్యలో జంటలు పాల్గొంటున్నాయి. దీంతో జనవరిలో కొన్నిసార్లు నిత్యకల్యాణ క్రతువును చిత్రకూట మండపంలో నిర్వహించాల్సి వచ్చింది.